AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

20-2-2026 (Friday) MAIN EDITION

## డీఎంకే కూటమిలో చేరిన డీఎండీకే



**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడులో త్వరలో శాసన సభ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో డీఎండీకే పార్టీ.. డీఎంకే కూటమిలో చేరింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధానకార్యదర్శి ప్రేమలత ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిశారు. సినీ నటుడు దివంగత విజయకాంత్ 2005లో ప్రారంభించిన 'దేశియ ముర్పోక్కు ద్రావిడ కళగం(డీఎండీకే)' 2011లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని ప్రధాన ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. త్వరలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్న తరుణంలో డీఎండీకే ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే..

## జీపీలకు రూ.387.53 కోట్లు విడుదల



**అక్షరటుడే, హైదరాబాద్:** గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం మరోసారి గుడ్ న్యూస్ చెప్పింది. తాజాగా 15వ ఫైనాన్స్ కమిషన్ కింద మూడవ విడతలో భాగంగా రూ. 387.53 కోట్లు విడుదల చేసింది. కాగా.. ఇప్పటికే రెండు విడతల్లో ఫండ్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. మొదటి విడతలో భాగంగా రూ. 259.36 కోట్లు విడుదల చేయగా.. రెండో విడత కింద రూ. 387 కోట్లు ఇచ్చింది. తాజాగా మూడో విడత నిధులు విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు మొత్తం రూ.1034.42 కోట్లు విడుదలయ్యాయి.

## మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి అస్వస్థత



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. నిన్నరాత్రి నుంచి వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్న ఆయనను.. కుటుంబ సభ్యులు బేగంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని, రెగ్యులర్ చెకప్ కోసమేనని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఎల్‌బీనగర్‌లో పేలుడు



**అక్షరటుడే, హైదరాబాద్:** నగరంలోని ఎల్‌బీ నగర్‌లో గల చట్నీస్ హోటల్‌లో పేలుడు సంబంధివించింది. హోటల్ కిచెన్‌లోని ఇడ్లీ స్టీమర్ ఒక్కసారిగా పేలింది. దీంతో ముగ్గురు సిబ్బందికి గాయాలైనట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి హోటల్‌లో ఉన్న కస్టమర్ల భయంతో బయటకు పరుగులు తీశారు. పోలీసులు గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

## ఏలియన్స్ సమాచారం బయటపెడతా..



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్న ఏలియన్స్ సమాచారాన్ని బహిర్గతం చేస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గ్రహాంతర వాసుల సమాచార ఫైళ్లను గుర్తించి.. విడుదల చేయాలని ఫెడరల్ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఒబామా ఇటీవల ఏలియన్స్ గురించి మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్.. మార్గదర్శకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం..

**అక్షరటుడే, ఏపీ:** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. తమిళనాడు, కేరళలోని దక్షిణ ప్రాంతాల్లో రేపటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. అలాగే ఆంధ్ర ప్రదేశ్‌లోనూ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. రాయలసీమ, దక్షిణ తీర ప్రాంతాలకు వర్ష సూచన చేసింది. ఈ నెల 22 నుంచి దక్షిణ తీర ప్రాంతంలోని అనేక జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది.



## మైత్రీవనంలో భారీ అగ్నిప్రమాదం..

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మైత్రీవనంలో గల నీలగిరి బ్లాక్‌లో గల నాలుగో అంతస్తులో మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు అక్కడ కొందరు విద్యార్థులు.. నీలగిరి బ్లాక్‌లో చిక్కుకున్నట్లుగా తెలుస్తోంది. వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. అనంతరం విద్యార్థులను అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసుకువచ్చారు.



# అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**■ ఏఐ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్ కావాలి ■ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా మారాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న భారత్ ఏఐ సమ్మిట్-2026 సదస్సులో ఆయన శుక్రవారం ప్రసంగించారు. నూతన ఆవిష్కరణలు మన జీవితాల్లో పెను మార్పులు తెస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే మన జీవన విధానంలోనూ అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

వ్యవసాయరంగానికి ఏఐ టెక్నాలజీ ఎంతో దోహదపడుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ టెక్నాలజీ అన్ని రంగాలపై ప్రభావం చూపిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో ఏఐ స్టార్టప్స్ మంచి ప్రోగ్రెస్ చూపిస్తున్నాయని చెప్పారు. జీఎస్టీ కౌన్సిల్ తరహాలో నేషనల్ ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

### ఏఐ వార్ రూం ఏర్పాటు చేయాలి

ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఇందుకోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి ఆరునెలలకు హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఐఏ సదస్సులు జరగాలన్నారు. అయితే ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

### అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగంలో అవకాశాలను భారత్ అందిపుచ్చుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐలో స్టార్టప్‌లను భారత్ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఏఐ టెక్నాలజీ అన్ని రంగాలపై ప్రభావంచూపిస్తోందన్నారు. ఏఐ శకం ఇప్పటికే మొదలైందని.. గతంలో పారిశ్రామి విప్లవం వచ్చిందని.. ఇప్పుడు సాఫ్ట్ వేర్ విప్లవం నడుస్తోందన్నారు.

## కాంగ్రెస్‌పై కోమటిరెడ్డి హాట్ కామెంట్స్



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర నేతల ఢిల్లీ పర్యటన వేళ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై రాజకీయ వర్గాలో చర్చ సాగుతోంది. ఓ యూట్యూబ్ చానల్‌తో మాట్లాడుతూ.. బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరినప్పుడు నాకు మంత్రి పదవి ఆఫర్ చేశారన్నారు. అయితే ఆ మాటను పార్టీ నిలబెట్టుకుంటుందా లేదా అనేది తర్వాత విషయమని.. కానీ పార్టీ అధికారంలోకి వచ్చాక తనను పార్టీలోకి తీసుకువచ్చిన నేతలు తనపై ప్రవర్తించిన తీరు అవమానకరమని వ్యాఖ్యానించారు. హామీ నెరవేర్చడంలో పార్టీ ఇబ్బందులు ఉండొచ్చన్నారు. కానీ ఈ విషయాన్ని కనీసం పిలిచి చెప్పకపోవడం దుర్మార్గమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడలు నచ్చక నేను బీజేపీకి వెళ్తే అక్కడ నన్ను ఎంతో గౌరవించారని కోమటిరెడ్డి అన్నారు. బీజేపీలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, స్టేట్‌లో స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ పదవి ఇచ్చారన్నారు. అంత గౌరవించినా.. కాంగ్రెస్ కన్నతల్లిలాంటిదని.. తిరిగి ఆహ్వానిస్తున్నారని వచ్చానని పేర్కొన్నారు. మంత్రి పదవి ఇవ్వకపోయిన పర్వాలేదని.. కానీ నన్ను అవమానించిన తీరు బాగోలేదని వ్యాఖ్యానించారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** గత సెషన్‌లో భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం కోలుకుంది. బ్యాంక్, మెటల్, ఎఫ్ఎంసీజీ సెక్టార్ల స్టాక్స్‌లో వాల్యూ బయ్యింగ్ కనిపించింది. భారత్, యూఎస్‌ల మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఏప్రిల్‌నుంచి అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలు ఇన్వెస్టర్లలో పాజిటివ్ సెంటిమెంట్‌ను పెంచాయి. అయితే ఇరాన్, యూఎస్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతుండడం, ముడి చమురు ధరలు పెరుగుతుండడంతో చివరలో ఇన్వెస్టర్లు తిరిగి లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఐటీ సెక్టార్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 226 పాయింట్ల నష్టంతో ప్రారంభమై మరో 66 పాయింట్లు కోల్పోయింది. అక్కడినుంచి 926 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ 48 పాయింట్ల నష్టంతో ప్రారంభమై మరో 27 పాయింట్లు పడిపోయింది. అక్కడినుంచి 284 పాయింట్లు పెరిగింది. చివరికి సెన్సెక్స్ 316 పాయింట్ల లాభంతో 82,814 వద్ద, నిఫ్టీ 116 పాయింట్ల లాభంతో 25,571 వద్ద స్థిరపడ్డాయి.

## '2026లో బత్తాయిలకు నరకం చూపిస్తా..'



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రముఖ యూట్యూబర్ నా అన్వేషణ అన్వేష్‌కు మెటా షాకిచ్చిన విషయం విదితమే. ఇటీవల అతను చేసిన కొన్ని వీడియోలు నెట్టింట తీవ్రదుమారం రేపాయి. దీంతో పలువురు ఫిర్యాదులు చేయడంతో పాటు వరుసగా నెటిజన్లు ఇన్‌స్టా ఐడీకి రిపోర్టు చేయడంతో మెటా.. అన్వేష్ ఇన్‌స్టా అకౌంట్‌ను బ్యాన్ చేసింది. ఈ అంశం ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా దీనిపై అన్వేష్ స్పందించాడు. మరో ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసి అందులో ఓ వీడియో పోస్ట్ చేశాడు. ఇన్‌స్టా ఛానల్ పోయినందుకు నాకేం బాధ లేదని వీడియోలో పేర్కొన్నాడు. 'రూపాయి రాని ఇన్‌స్టా అకౌంట్ ఉంటే ఏంటి పోతే ఏంటి. ఇన్ స్టా ఛానల్స్, యూట్యూబ్ ఛానల్స్ అనేవి నా రెండు చేతులు, రెండు కాళ్లు లాంటివి. ఫేస్ బుక్ అకౌంట్ నా బాడీతో సమానం. ఎన్ని అకౌంట్లు బ్యాన్ చేసినా వీడియోలు చేయడం ఆపేది లేదు. అన్నీ బ్యాన్ చేసినా.. వాటన్నింటినీ నడిపించే నా బుర్రని ఏం చేయలేరు. 2026లో బత్తాయిలకు నరకం చూపిస్తాను.' అంటూ వ్యాఖ్యానించారు.

## నాడు రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన: మైథిలీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌పై గాయని, బీహార్ ఎమ్మెల్యే మైథిలీ ఠాకూర్ తీవ్ర విమర్శలు చేశారు. బీహార్ అసెంబ్లీలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లో లాలూ పాలన గురించి ఆలోచించిన ప్రతిసారీ తనకు ధృతరాష్ట్రుడి పాలన గుర్తుకువచ్చేదన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడు రాజ్యం కోసం కాకుండా కొడుకు దుర్యోధనుడి కోసం ఆందోళన చెందినట్లు.. లాలూ కూడా ప్రజల గురించి కాకుండా తేజస్వీ యాదవ్ రాజకీయ జీవితం కోసం తపించేవారని ఎద్దేవా చేశారు. ప్రజల బాధలు ఆయన కంటికి కనిపించేవి కావన్నారు. ఆయన పాలనలో బీహార్ విద్యకు దూరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో తరాలు ఉపాధి, అభివృద్ధి లేక ఇప్పటికీ బాధ పడుతున్నాయన్నారు.

## బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనున్న మీనాక్షి చౌదరి..



**టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి. ఈ అమ్మడు మరో కీలక అడుగు వేయబోతున్నట్టు తెలుస్తోంది. వరుసగా ఛాన్స్‌లు దక్కించుకుంటూ దూసుకుపోతున్న మీనాక్షి.. తాజాగా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారనే వార్తలు ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. టాలీవుడ్‌లో లక్కీ భాస్కర్, హిట్ 2, సంక్రాంతికి వస్తున్నాం వంటి చిత్రాలను గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ.. ఇటీవల నవీన్ పోలిశెట్టి హీరోగా రిలీజైన 'అనగనగా ఒక రాజు' చిత్రంతో అలరించింది. ఈ సినిమా సక్సెస్‌తో మీనాక్షి క్రేజ్ మరింత పెరిగింది. కాగా.. మీనాక్షి బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ సరసన నటించే ఛాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. ఆయన నటిస్తున్న భాగమ్ భాగ్ 2 సినిమాలో హీరోయిన్‌గా ఆమె పేరు ఫైనల్ అయినట్లుగా తెలుస్తోంది.**

**—అక్షరటుడే, సినిమాడెస్క్**

## ఏప్రిల్ నుంచి అమల్లోకి భారత్ అమెరికా ట్రేడ్ డీల్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్ అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర ట్రేడ్ డీల్ ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం తెలిపారు. చర్చలు ప్రస్తుతం తుదిదశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఒప్పందానికి సంబంధించిన న్యాయపరమైన అంశాలపై చర్చించి, ఖరారు చేసేందుకు భారత్ అమెరికా అధికారులు ఈ నెల 23న అమెరికాలో భేటీ కానున్నట్లు సమాచారం.

